# కథ

నల్లగొండ జిల్లాలో అదొకపేట
ఆపేటలో కరువు వుంది
కన్నీరూ వుంది
కలతలున్నాయ్
బతుకు వుంది
మెతుకూవుంది
తిండిలేక ఏడ్చేవాళ్ళూవున్నారు
తిన్నదరక్క ఏడ్చేవాళ్ళున్నారు
ఆ పేటలో దరిద్రం పొద్దున్నే నిద్ర లేస్తుంది
ఆ తర్వాతే కోడి కూత కూస్తుంది
స్వాతంత్ర్యం చిరిగిన జెండాలా వాళ్ళ జీవితాల్లో మార్పును తీసుకురాలేకపోయింది.
అక్కడ సూర్యని వెలుతురు చూడని జీవితాలున్నాయి
ఎముకల గూళ్ళు కట్టుకున్న శరీరాలున్నాయ్
ఆ శరీరాల మీద ఈగలు, దోమలు స్వేచ్ఛగా ఆటలాడుకుంటయ్, పోట్లాడుకుంటయ్
సభ్యసమాజం తలదించుకునేలా ఆపేటవుందనడంలో ఎలాంటి సందేహం లేదు.
ఆ పేటలో 'చదువు' బంధించబడివుంది.
ఆ చదువు 'కొన్న' వారికే అది దక్కుతుంది
అక్కడ అజ్ఞానాంధకారంలో కొట్టుమిట్టాడే అట్టడుగు బడుగు జీవితాలే ఎక్కువ.
ఆ అట్టడుగు వర్గాలను చూచి అట్టహాసం చేసేవాళ్ళు వెట్టి చేసి బ్రతుకులీడుస్తున్న మట్టి జీవితాలను మట్టి కరిపించే వాళ్ళూ ఆపేటలో కోకొల్లలు.

గమ్యం అగమ్యగోచరం ఐనప్పుడు వాళ్ళకు భూస్వాములే వరాలిచ్చే స్వాముల్లా కన్పించారు.

అతివృష్టి వల్ల ఏర్పడ్డ కరువు వాళ్ళ జీవితాల్లో నిరాశా, నిస్పృహల్ని కల్గజేశాయి.

చేతినిండా పనిలేక కొందరు భూస్వాముల వద్ద పాలేర్లుగా చేరారు. మరికొందరు తమపొలాలు తాకట్టుపెట్టి వచ్చిన సొమ్ముతో రోజుల్ని నెట్టుకొస్తున్నారు భారంగా.

ఆపేట వాసుల అమాయకత్వాన్ని, అజ్ఞానాన్ని ఆసరాగా తీసుకొని భూస్వాములు ఇష్టారాజ్యమేలుతున్నారు.

ఈ విధంగా కొన్ని నెలలు.... సంవత్సరాలు కాలగర్భంలో కొట్టుకుపోయాయి.

ప్రతిపక్షాల్లేని ప్రజారాజ్యంలా ఆపేటలో ఆకలి రాజ్యమేలుతుంది. పగలంతా రెక్కలు ముక్కలు చేసుకొని అలసిన శరీరాల్తో ఆరుబయటే కునుకుతీస్తారు.

ఆపేటలో మిణుకు మిణుకుమనే దీపాలు వాళ్ళ బ్రతుకుకు శాపాలుగా వున్నయ్.

ప్రభుత్వాలు మారుతున్నాయేగాని ఆపేటజనంలో ఎలాంటి మార్పురాలేదు.

భూస్వాముల కబందహస్తాల్లో పాలేర్లు పావులుగా నలిగిపోయారు. వాళ్ళ శ్రమశక్తిని దోచుకుంటున్న భూస్వాములు వాళ్ళను కుక్కల కన్నా హీనంగా హింసించేవారు.

## వూళ్ళోకి అచ్చరమొచ్చింది

ఇవేమీ పట్టనట్టు తమకేమీ సంబంధంలేనట్లు ఉన్నట్టుండి
ఒకరోజు కుండ పోతలా వర్షం కురిసింది.
తమ బ్రతుకులకు శాపంలా...
పగబట్టిన శత్రువులా...
వర్షానికి తోడు పెద్ద గాలులు....
అది తుఫానులా విజృంభించింది.
పెద్ద పెద్ద చెట్లు కూలిపోయాయ్.
మట్టిళ్ళు మట్టిలో కొట్టుకుపోయాయ్.
అప్పులు చేసి పండించుకున్న పంటంతా సర్వనాశనమైంది........
అతివృష్టి వల్ల అంతా పోగొట్టుకున్న రైతులు దిక్కులేక కొందరు షావుకార్లనాశ్రయించారు. మరికొందరు భూస్వాములనాశ్రయించారు.

తాము తీసుకున్న అప్పు తమ జీవితాలకు ముప్పు అవుతుందని ఊహించని పాలేర్లు ఆ అప్పు తీర్చేందుకు నానా తిప్పలు పడుతున్నారు.
ఉన్నట్లుండి ఒకరోజు ఆపేటకు వెంకట్రామయ్య పంతులు వచ్చాడు.
ప్రభుత్వం తనని రాత్రి బడికి బోధకునిగా నియమించినట్లు చెప్పాడు.
రాత్రి బడికి వచ్చి రాతనేర్చుకుంటే వాళ్ళ తలరాతే మారిపోతుందని ప్రతి ఒక్కరికీ చక్కగా వివరించాడు.
కానీ ఆ పేట జనానికి పంతులు మాటలు రుచించలేదు. పని చేయందే పొట్టగడవని తమ జీవితాలకు చదువుకునే యోగం లేదన్నారు.
తమ పిల్లలకే చదువులేనప్పుడు తమకెందుకన్నారు. చదివి ఏం చెయ్యాలి? అని నిలదీశారు. చదువుకుంటే మా బతుకులు బాగుపడ్తయ్యా? మా కడుపులు నిండుతాయా? అని ప్రశ్నించారు.

పున్న అంజయ్య

ఆ పేట వాసుల అమాయకత్వం, అజ్ఞానం వాళ్ళనిలా మాట్లాడిస్తుందని తెలుసుకున్న వెంకట్రామయ్య, కొన్నాళ్ళు ఓపికపట్టి సమయంకోసం నిరీక్షించాడు. ఎప్పటికైనా 'చదువు' యొక్క విలువను ఆపేట జనం తెలుసుకుంటారని సమయం కోసం వేచిచూశాడు.

ఓ రోజు సూరయ్య వెంకట్రామయ్య పంతులు వద్దకు రొప్పుకుంటూ వచ్చాడు. విషయమేమిటని పంతులు సూరయ్యను నిలదీశాడు. తాను నాగలింగం దొరవద్ద తనపొలం తాకట్టుపెట్టి వెయ్యి రూపాయలు అప్పు తీసుకుంటే రెండు వేలు తీసుకున్నట్లు తనచేత వేలిముద్ర వేయించుకున్నాడు ఇప్పుడు తన పొలం బాకీకింద పోగా తానింకా బాకీ పడ్డానని చెప్పుకొని గొల్లుమన్నాడు. ఆ పేట జనమంతా అక్కడికి గుంపుగా వచ్చారు. సూరయ్య తనగోడు చెప్పుకుని గోడుగోడున ఏడ్చాడు. ఆ పేటలో నాగలింగం దౌర్జన్యం నాగుపామై తమ జీవితాల్నే కాటేస్తాయని ప్రతి ఒక్కరూ పంతులుతో చెప్పుకొని కన్నీరు మున్నీరుగా విలపించారు. ఇంతకాలం ఆ పేట జనం అజ్ఞానంలో వుండటం వల్లే నాగలింగం దౌర్జన్యం సాగుతుందని అతని అన్యాయాన్ని అరికట్టడానికి అందరూ దీక్షబూనుకున్నారు.

ఇన్నాళ్ళు చదువెందుకు? అనుకున్న పేటవాసులకు జ్ఞానోదయమయ్యింది. నాగలింగం అన్యాయాన్ని అరికట్టేందుకు చదువు ఎంతో అవసరమని తెలుసుకున్నారు. తమ జీవితాల్లో వెలుగును చూడాలని, వెంకట్రామయ్య పంతులు చదువు కోసం ఎంత ఆరాటపడుతున్నారో ఒక్కొక్కరే ఆలస్యంగా తెలుసుకున్నారు.

పేటలోని జనం మారినందుకు వెంకట్రామయ్య పంతులు ఎంతో సంతోషించారు. తన లక్ష్యం నెరవేరుతున్నందుకు పేట వాసులకు మనుసులోనే కృతజ్ఞతలు తెలుపుకున్నాడు.



హైదరాబాదులోని ఎమెస్కో హౌస్‌లో తేది : 2-2-2009 రోజున రాజేందర్ జింబో రాసిన ఎమెస్కో ప్రచురణ 'మా వేములవాడ కథలు' ఆవిష్కరించిన జస్టిస్ ఆర్.సుభాష్ రెడ్డి, అధ్యక్షులు మునిపల్లె రాజు

ఎడమనుండి వరుసగా - ఎమెస్కో విజయకుమార్, నందిని సిధారెడ్డి మునిపల్లెరాజు జస్టిస్ ఆర్.సుభాష్‌రెడ్డి, రాజేందర్ జింబో, పరుఖుల శివకుమార్.

## నక్షత్రాలు

ఈ పొడవాటి
నల్లని పలకపై
రాత్రి వచ్చి
రాసేటి
మౌనభాష లిపులా
ఇవి?
    'చందమామ' అనే
    ఒకే ఒక వాక్యాన్ని కావ్యంగా రాసి
    ముగించాక..... అయిపోయిందని చెప్పటానికి
    ఇన్ని చుక్కల్ని పెట్టాడే,
    ఎవరతను?
'ఈ పూలని కొయ్యకండి'
అని పలకమీద చందమామ
రాసిన హెచ్చరికలు
మబ్బులు కమ్మటం చేత
తుడుచుకు పోయాయా?
అంతగట్టిగా రుద్ది, తుడిపినా
పోని మురికే ఆ మచ్చలా?
    వేకువ...
    తన ప్రతి పుట్టిన రోజునా
    ఒక్కసారి ఊది
    అన్ని కొవ్వొత్తుల్నీ
    ఆర్పేస్తుందా?
నక్షత్రాల్లారా!
మీ నేలమీదున్న
దుమ్మూ ధూళీ శుభ్రం చెయ్యండి,
ఈ రోజు కాకపోయినా
రేపైనా
అక్కడికి మేము
విహారానికి రావొచ్చు!

తమిళ కవిత : వైరముత్తు

అనువాదం : ఆర్.శాంత సుందరి